క్లుప్తంగా

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు



నకరికల్లు: ఎరువులను ఎమ్మార్పీకన్నా అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు హెచ్చరించారు. నకరికల్లులోని పలు ఎరువుల, పురుగుమందుల దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్‌లు పరిశీలించారు. ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల బిల్లు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్, గోడౌన్‌లలోని ఎరువులను తనిఖీ చేశామన్నారు. ఎరువులు, పురుగుమందులను విక్రయించే క్రమంలో నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. అధిక ధరలకు విక్రయించిన దుకాణదారులపై ఎఫ్‌సీవో 1985 ప్రకారం చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. రైతులకు ఇచ్చే విక్రయ రసీదుపై రైతులు కొనుగోలు చేసిన ఎరువుల వివరాలు, రైతు సంతకం, అమ్మినవారి సంతకం, లాట్ నంబర్ తప్పనిసరిగా పొందుపరచాలన్నారు. అనంతరం ఎరువుల్లో మూడురకాల నమూనాలు సేకరించి నాణ్యతాపరీక్షల కోసం ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ వెంకటేశ్వర్లు మృతి

సత్తెనపల్లి: మాజీ కౌన్సిలర్, వాల్మీకినగర్‌లోని రామాలయం వంశపారంపర్య ధర్మకర్త ఎద్దులదొడ్డి వెంకటేశ్వర్లు (83) గురువారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పట్టణంలోని ఇంటి వద్ద మృతి చెందారు. మృతుని భార్య గతంలోనే కాలం చేసింది. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పట్టణంలో మొట్టమొదటి మున్సిపల్ పాలకవర్గంలో 1987 నుంచి 1992 వరకు 10వ వార్డు నుంచి, తిరిగి 2005 నుంచి 2010 వరకు 11వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలుపొంది రెండు పర్యాయాలు కౌన్సిలర్‌గా సేవలందించారు. ఆయన మరణ వార్త తెలియడంతో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేత్రాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సత్తెనపల్లి: నేత్రాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ మల్లేష్ అన్నారు. పట్టణంలోని ఆదరణ అనాథ ఆశ్రమంలో ఉన్న వద్దులకు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి (దూళిపాళ్ల) వారి సహకారంతో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లేష్ మాట్లాడుతూ ఆశ్రమంలో ఉన్న వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు ప్రతి ఒక్కరు ఉచిత కంటి వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, ఆదరణ అనాథ ఆశ్రమ నిర్వాహకులు రిషిత, హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు సోమశేఖర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు బయలుదేరిన అయ్యప్పలు



సత్తెనపల్లి: పట్టణం నుంచి అయ్యప్పస్వామి మండలకాల దీక్షను ముగించుకొని శబరిమలకు గురువారం పయనమయ్యారు. ఈ సందర్భంగా అచ్చంపేట రోడ్డులోని దుర్గా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవాయం వద్ద పూజలు నిర్వహించి పేటతుళ్ళి ఆడారు. మాల ధరించిన విఘ్నేశ్వర అయ్యప్ప భక్త బృందం వారు ఒక్కసారిగా రావడంతో మార్గం కిటకిటాడింది. 200 మంది మాలధరించిన అయ్యప్పస్వాములు శబరిమలకు బయలుదేరడంతో పట్టణంలో అయ్యప్ప నామస్మరణ మారుమోగింది.

రెంటచింతలలో చోరీ

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని ఉట్ల స్తంభాల సెంటర్‌లో గురువారం తెల్లవారుజామున ఓ కిరాణా దుకాణంలో చోరీ జరిగింది. నాళం లక్ష్మీనారాయణకు చెందిన కిరాణా దుకాణానికి ఉన్న షట్టర్‌ను, వేసిన తాళాన్ని పగులగొట్టారు. గుర్తుతెలియని దుండగులు దుకాణంలోకి చొరబడి సుమారు రూ.35 వేల విలువైన సిగరెట్లు, రూ.15వేల నగదు తస్కరించినట్లు బాధితుడు తెలిపాడు. లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

21న మెగా రక్తదాన శిబిరం

- రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయండి
- 21న సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 51వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న నియోజకవర్గ స్థాయిలో మెగా రక్తదాన శిబిరాన్ని భారీ స్థాయిలో నిర్వహిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం జరిగిన వైఎస్సార్‌సీపీ పట్టణ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ గత ఏడాది పట్టణంలో 836 మంది రక్తదానం చేశారని, ఈ ఏడాది 1000 మంది రక్తదానం చేసేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. సమష్టిగా ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేద్దామని అన్నారు. విద్యార్థి, యువకులను, వైఎస్సార్‌సీపీ శ్రేణులను నాయకులు చైతన్యం చేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు, పార్టీ జిల్లా కార్యదర్శి మక్కెన అచ్చియ్య, పల్నాడు జిల్లా వాణిజ్య విభా గం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ఇంటివద్దకే సేవలు



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంబూరు, పార్టీ నాయకులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

బెల్లంకొండ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ సేవలు ప్రజల ఇంటి వద్దకే తీసుకువచ్చారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. గురువారం మండలంలోని న్యూచిట్యాల, చంద్రాజుపాలెం గ్రామాలలో గ్రామ సచివాలయాలతో పాటు పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి పాలనలో పెనుమార్పులను ముఖ్యమంత్రి తెచ్చారన్నారు. ప్రభుత్వ సేవల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాల్సిన అవసరం లేకుండా అన్ని శాఖలను గ్రామానికే తెచ్చి, సేవలను ఇంటివద్దే అందిస్తున్నారన్నారు. న్యూ చిట్యాలలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, చంద్రాజుపాలెంలో రూ.25 లక్షలతో సచివాలయం, రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, పోలేరమ్మ తల్లి ఆలయం వద్ద సాగర్ కాలువపై పుష్కరఘాట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం అమూల్ సంస్థ ద్వారా చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన పాల ఉత్పత్తిదారులకు మంజూరైన రుణాల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మావెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి, ఎంపీడీవో వెంకటరెడ్డి, తహసీల్దార్ క్షమారాణి, మండల పార్టీ అధ్యక్షుడు ఓర్సు సాంబశివరావు, చింతారెడ్డి సాయిరెడ్డి, సర్పంచ్‌లు బాణావతు నరసింహానాయక్, కొడవటి బాబూజీ, ఎంపీటీసీ రాంబాబు, నరసింహానాయక్, మండల జేసీఎస్ కన్వీనర్ మిల్లు వెంకటరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి 15 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

బెల్లంకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అన్ని వర్గాల మెప్పు పొందుతుందని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. గురువారం మండలంలోని చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఏసోబుతో పాటు 15 కుటుంబాలకు చెందిన 30మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ సర్పంచ్ కొడవటి ఏసోబు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కొడవటి దిలీప్ వెంకటేశ్వర్లు, బాబు, దావీదు, సాగర్, కలపాల చిన్ని, కొండయ్య, కోటిస్వామి, యాకోబు, కోట కోటయ్య, కలపాల వెంకయ్య, తాళ్లపోగు ఏసోబు, గురవయ్య, హనూక్, విజయకుమార్, ఏసుదాసు కుటంబాలకు చెందిన వారు పార్టీలో చేరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న పథకాలు, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే శంకరరావు చేస్తున్న కృషికి ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావెంకటేశ్వర రెడ్డి, జెడ్పీటీసీ వెంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ కొడవటి బాబూజీ, పార్టీ మండల అధ్యక్షుడు ఓర్సు సాంబశివరావు, మిల్లు వెంకటరెడ్డి, కోటేశ్వరరావు, రామకృష్ణ, సుబ్బయ్య పాల్గొన్నారు.

మానసిక వికలాంగులను చిన్న చూపు చూడరాదు

ఎంఈవో సాంబశివరావు



చిన్నారులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంఈవో

గురజాల : మానసిక వికలాంగులను ఎవరూ చిన్న చూపు చూడరాదని ఎంఈవో సాంబశివరావు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ మానసిక వికలాంగుల దినోత్సవంలో భాగంగా గురువారం మాట్లాడుతూ భవిత కేంద్రాల ద్వారా మానసిక వికలాంగుల్లో కొంత మేర మార్పు వస్తుందని ఈ కేంద్రంలో ఆట పాటలు, విద్యతో పాటు వారంలో రెండు రోజులు ఫిజియోథెరపి చేయడం జరుగుతుందన్నారు. మానసిక వికలాంగులు భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మానసిక వికలాంగులకు ట్యాబ్‌లు, పలకలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం నిర్వాహకులు మాచర్ల విజయలక్ష్మి, బి.రూన్సీరాణి, సీఆర్పీ మేకల ప్రసాద్ తదితరులున్నారు.

ప్రభవించిన పల్నాటి వీరుల ప్రభ



వీరాచారవంతుల కత్తిసేవలు వీక్షిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే



మందపోరు నాడు అంకాలమ్మ తల్లి

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాలలో భాగంగా గురువారం జరిగిన మందపోరుకు భక్తజనం పోటెత్తారు. వీరుల గుడి ఆవరణ భక్తులతో నిండిపోయింది. ఎటు చూసినా పల్నాటి వీరుల ఆయుధాలే కన్పించాయి. వీరుల ఆయుధాలతో వీరాచారవంతులు వారి వెనుక వీర బుట్టలతో మహిళలు, కుటుంబ సభ్యులు పిల్లలతో కన్పించారు. వీరుల గుడి ఆవరణలో పొంగళ్లు చేసుకుని అంకాలమ్మ, చెన్నకేశవస్వామికి సమర్పించారు. అంకాలమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అంకాలమ్మతో పాటు పోలేరమ్మ, పాతపాటేశ్వరమ్మ గ్రామ దేవతలను కూడా దర్శిచుకుంటున్నారు. పల్నాటి వీరాచారవంతులకు ఇలవేల్పులు వీరే. వంశ పారంపర్యంగా తరతరాలుగా వీరాచారవంతులు ఇలా చెన్నకేశవుడు, అంకాలమ్మ తల్లి దేవతామూర్తులను కొలుస్తున్నారు. అలాగే బ్రహ్మనాయుడు చాపకూడు సిద్ధాంతం అమలు కార్యక్రమానికి ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. దీంతో వీరుల గుడి ప్రాంగణం పల్నాటి వీరుల ప్రభతో వెలిగిపోయింది.

కౌలురైతు ఆత్మహత్య

దాచేపల్లి : మండలంలోని గామాలపాడుకి చెందిన కౌలురైతు సంకురాత్రి వెంకటకోటయ్య(42) తన పొలంలో పురుగుల మందు తాగి బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పొలంకు వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులతో చెప్పి వెళ్లిన వెంకటకోటయ్య రాత్రి 10 గంటలు దాటిన ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ఘటన స్థలంకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ దాసరి శివనాగరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దాచేపల్లి : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. తెలంగాణ రాష్ట్రంలోని వలిగొండ మండలం పొద్దటూరికి చెందిన పెద్దబోయిన రమేష్(36) వాహనం ఢీకొట్టటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ జీ సంధ్యారాణి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రమేష్ వ్యక్తిగత పనుల నిమిత్తం దాచేపల్లి వచ్చాడు. స్థానిక రెస్టారెంట్ సమీపంలోని రోడ్డుపై నడుస్తున్న క్రమంలో పిడుగురాళ్ల వైపు నుంచి వచ్చిన వాహనం ఢీకొట్టటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం. ఘటన స్థలాన్ని ఎస్ఐ సంధ్యారాణి పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రేమను పంచండి.. మంచిని పెంచండి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

గుడిపాడు(క్రోసూరు): క్రీస్తు మార్గంలో గ్రాడ్యుయేట్లు కూడా అందరికి ప్రేమను పంచుతూ మంచిని పెంచాలని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. గురువారం క్రోసూరు మండలం గుడిపాడులో లూథరన్ స్కూల్ ఆఫ్ థియాలజీ 3వ స్నాతకోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బైబిల్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 10 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారిని అభినందించారు. తోటివారిని ప్రేమించడం, సాయం చేయడమే బైబిల్ సారాంశమని, దాన్ని చదివి గ్రాడ్యుయేషన్ పొందిన వారు క్రీస్తు మార్గాన్ని అనుసరించాలని సూచించారు. కార్యక్రమాన్ని పాస్టర్లు రెవ.డాక్టర్ బెనర్జీ దుగ్గి(గుడిపాడు), రెవ.బి.ప్రవీణ్‌కుమార్(కొండూరు), రెవ. సత్యానంద్‌కుమార్(ధరణికోట), రెవ.సామ్యూల్ పీటర్ (నాగవరం), దుగ్గి చిన్నబాబు(జాన్ రిచర్డ్) గుడిపాడు, రెవ.నిరంజన్ రెడ్డిగూడెం, రెవ.సందెపోగు ఏసురత్నం అచ్చంపేట, గనుపల్లి సాల్మన్‌రాజు గుడిపాడు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సర్టిఫికెట్లు పొందిన గ్రాడ్యుయేట్లు, ఎంపీపీ పి.కోటయ్య, గ్రామ పార్టీ నాయకుడు షేక్.ఖాజా, చిల్కా పెదబాబు, పాశం శ్రీనివాసరెడ్డి, గార్లపాటి దాసు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ముప్పాళ్ళ: మండలంలోని పలు గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయాధికారి ఎం.అరుణ గురువారం తనిఖీ నిర్వహించారు. ముప్పాళ్ళ, మాదల, నార్నెపాడు, లంకెలకూరపాడు, దమ్మాలపాడు గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. ఆయా దుకాణాల్లో ఉన్న నిల్వలను తనిఖీ చేశారు. రైతులకు అధిక ధరలకు ఎరువులు అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్ రద్దు చేస్తామని చెప్పారు. ప్రతి రైతుకు అమ్మకానికి సంబంధించిన రశీదు ఇవ్వాలని సూచించారు. స్టాక్ బోర్డు, ధరల పట్టిక అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. ఆమెతో పాటు వీఏఏ పావని, శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



పిడుగురాళ్ల: పట్టణంలోని నాగులగుడి దేవస్థానంలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి షష్టి మహోత్సవాల సందర్భంగా రెండవ రోజు విశేష అలంకరణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను అందుకున్నారు.

'ఆడుదాం ఆంధ్రా' వాయిదా

గురజాల : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను వెలికి తీసే క్రమంలో భాగంగా ఈ నెల 15వ తేదీ నుంచి జరగాల్సిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం వాయిదా పడినట్లు నగర పంచాయతీ కమిషనర్ ఎ.మోహన్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తన కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ తుఫాన్ కారణంగా శుక్రవారం నుంచి జరగాల్సిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం 26వ తేదీ నుంచి జరుగుతుందన్నారు. సచివాలయాల్లో ఆసక్తి కలిగిన క్రీడాకారులు వారి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

కారు ఢీకొని తండ్రీ కొడుకులకు గాయాలు

నాదెండ్ల: జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో తండ్రీ కొడుకులకు గాయాలైన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గణపవరం శాంతినగర్‌లో నివాసం ఉండే వంగర కోటేశ్వరరావు చిలకలూరిపేట ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తుంటాడు. బుధవారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో కుమారుడు మురళీకృష్ణ తన బైక్‌ను డిపో వద్దకు తీసుకొచ్చి తండ్రిని ఎక్కించుకుని గణపవరం వెళ్తున్నాడు. గణపవరం కుప్ప గంజివాగు బ్రిడ్జిపై రాగానే చిలకలూరిపేట నుంచి గుంటూరువెళ్తున్న కారు ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న తండ్రీ కొడుకులు ఎగిరి కొంతదూరంలో పడ్డారు. ద్విచక్ర వాహనం కూడా పదడుగుల మేర ఈడ్చుకెళ్లింది. గాయాలైన ఇరువురినీ చిలకలూరిపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దీనిపై వంగర కోటేశ్వరరావు కుమార్తె పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు స్వాధీనం చేసుకుని నాదెండ్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కమ్యూటీ హాల్‌కు రూ.15లక్షల నిధులు మంజూరు

భూమి పూజ చేసిన రాష్ట్ర మంత్రి అంబటి



ఇనిమెట్ల ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అంబటి

రాజుపాలెం: ఎస్సీ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌ను త్వరగా పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అధికారులకు సూచించారు. మండలంలోని ఇనిమెట్ల ఎస్సీ కాలనీలో రూ.15 లక్షల నిధులతో మంజూరైన కమ్యూనిటీ హాల్‌కు మంత్రి అంబటి, నాయకులతో కలసి గురువారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మర్రి సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి అంబటి మాట్లాడుతూ త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభం కూడా చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని వివరించారు. కరోనా కష్టకాలంలోను సంక్షేమాన్ని కొనసాగించారని గుర్తు చేశారు. పేద వర్గాల ఆర్థిక పరిస్థితి మెరుగు పడేందుకు సంక్షేమ పథకాలు ఎంతగానో దోహదపడుతున్నాయని అన్నారు. విద్యా, వైద్యం, వ్యవసాయ రంగాలలో ప్రభుత్వం తీసుకొచ్చిన పారదర్శకమైన పాలన సంస్కరణలు అన్ని వర్గాలకు ఉపయోగపడ్డాయని వివరించారు. ఇనిమెట్ల గ్రామం వైఎస్సార్ సీపీకి బలమైన గ్రామమని, గత ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ వచ్చిన గ్రామమని, అదేవిధంగా మరలా వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ రావాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సీనియర్ నాయకులు బాసు లింగారెడ్డి, జెడ్పీటీసీ సునీతశ్రీనివాసరెడ్డి, సర్పంచ్ సైదుహుస్సేన్, ఎంపీటీసీ మబూసుభాని, మాజీ ఎంపీటీసీ బండికల్లు శ్రీనివాసరావు, కమల్‌సాహెబ్, ముప్పాళ్ల బొర్రయ్య, పాపాబత్తుల జోసఫ్, కాళ్ల పున్నయ్య, పశ్యావుల కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ వేల్పుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ఐక్యంగా కృషి చేద్దాం



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మేకల హనుమంతరావు

అమరావతి: మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధికి అధికారులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మేకల మాట్లాడుతూ ప్రస్తుతం మండల పరిషత్ ద్వారా నిధులను మండల పరిధి గ్రామాలలో ఎంపీటీసీలు సూచించిన అభివృద్ధి పనులకు కేటాయించటం జరిగిందన్నారు. గ్రామాలలో సిమెంట్‌రోడ్లు, డ్రైనేజీలు, గ్రావెల్ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలలో మరుగుదొడ్లు తదితర పనులను ఆమోదించటం జరిగిందన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహకారంతో మండల సర్వతోముఖాభివృద్ధికి మండల పరిషత్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు మంగిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీడీవో ఉమాదేవి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, మండల పరిధి గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నూతన భవనంలో చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంకు



సీజీజీబీ నూతన శాఖను ప్రారంభిస్తున్న చైర్మన్ కామేశ్వరరావు

నకరికల్లు: గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల, మహిళల, ఖాతాదారుల అభివృద్దే లక్ష్యంగా చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు(సీజీజీబీ) పనిచేస్తుందని చైర్మన్ టి.కామేశ్వరరావు అన్నారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో అధునాతన వసతులతో కూడిన నూతన భవనంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు శాఖను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మొత్తం 255 శాఖల ద్వారా ఖాతాదారులకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ 255 శాఖలు సెప్టెంబర్ త్రైమాసికం నాటికి రూ.20,800 కోట్ల వ్యాపారం చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బ్యాంకు అంకితభావంతో పని చేస్తుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన రీజనల్ మేనేజర్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న తోడు పథకం కోసం రూ.15 కోట్లు, పాడి రైతులకు రూ.15 కోట్లు, కౌలురైతులకు రూ.108 కోట్ల రుణాలు మంజూరు చేశామని తెలిపారు. కౌలురైతులకు సంబంధించి రూ.12.21 కోట్లు, స్వయంసహాయక సమబృందాలకు రూ.643.55 కోట్లు, రైతులకు సంబంధించి రూ.748.94 కోట్ల రుణాలకు సంబంధించిన ప్రోటోటైప్ చెక్కులను చైర్మన్ టి.కామేశ్వరరావు చేతులమీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సీజీజీబీ గుండ్లపల్లి శాఖ మేనేజర్ వి.శివనాగకృష్ణ కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో సిబ్బంది కె.ఆంజనేయులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి



అర్బన్ మార్కెట్ ప్రారంభోత్సవంలో చైర్‌పర్సన్ సుబ్బమ్మ

దాచేపల్లి : మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అన్నారు. నారాయణపురం బ్రహ్మనాయుడు ఆడిటోరియంలో మెప్మా–మహిళ స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్‌ను గురువారం నిర్వహించారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన నేత చీరలు, క్రాఫ్ట్ వస్తువులు, వివిధ రకాల తినుబండరాలు ప్రదర్శించారు. పలువురు ఈ మార్కెట్‌ను సందర్శించి పలు వస్తువులను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుబ్బమ్మ మాట్లాడుతూ..డ్వాక్రా సంఘాల్లోని మహిళలు తయారు చేసిన వస్తువులను విక్రయించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. డ్వాక్రా మహిళలకు అండగా ఉండేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాదిరూపాయలు ఖర్చు చేస్తున్నారని, ప్రభుత్వం ద్వారా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌బాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, నగర పంచాయతీ కమిషనర్ వి.సత్యనారాయణ, మెప్మా టీఎంసీ జానీ, సీవో సీహెచ్ విజయలక్ష్మి, ఆర్పీలు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది



మాచర్ల: జిల్లా వ్యాప్తంగా తుఫాన్ ప్రభావం వలన రైతులకు జరిగిన పంట నష్టం గురించి పూర్తిస్థాయిలో అంచనా వేయటం జరుగుతుందని, నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు నివేదికలు రూపొందిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రాథమికంగా శనగలు, పత్తి, మినుము, కంది, పొగాకు, మిర్చికి సంబంధించి మొత్తం 13,778 హెక్టార్లు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు గుర్తించారన్నారు. ఈ పంటలకు నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ప్రతి రైతు వ్యవసాయ అధికారులకు తమ పంట నష్టం గురించి తెలపాలన్నారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

దుర్గి: ప్రజా సమస్యలే అజెండాగా ఈ నెల 16న శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్డీ జి.ఎల్.ఎన్.గుప్తా తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు ఏసూరి సునీతసాయిశంకర్ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ హాల్లో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మండల పరిధిలో ప్రజ లు ప్రధానంగా ఎదుర్కొంటున్న తాగునీరు సమస్య, తుపాను ప్రభావం వల్ల పంట నష్టపోయిన రైతుల నష్టపరిహారం తదితర సమస్యలపై చర్చించనున్నారన్నారు. సమావేశానికి మండల పరిధిలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.